నేడు ఉద్యోగ జాబ్ మేళా

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఆదర్శ ఆటో మోటీవ్స్ ప్రైవేట్ కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ మెకానిక్, డిగ్రీ అర్హత ఉన్న 22–30 ఏళ్లు గల అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేటి నుంచి 'కంఠమహేశ్వర' వేడుకలు

చిన్నగూడూరు, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో కంఠమహేశ్వరస్వామి వేడుకలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గౌడ సంఘం బాధ్యులు గాడిపల్లి నర్సయ్య, వెంకన్న, సత్యనారాయణ తెలిపారు. సోమవారం ప్రత్యేక పూజలు, శుక్రవారం కంఠమహేశ్వరునికి జలాభిషేకం, శనివారం బోనాలు, అనంతరం స్వామివారి కల్యాణం, ఆదివారం సహపంక్తి భోజనాలతో వేడుకల ముగింపు ఉంటుందని వివరించారు.

'బ్యాక్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సోమారపు వీరస్వామి కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకన్న, చంద్రమౌళి, మల్లేశ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

అస్లాం పాష(ఫైల్)

నెల్లికుదురు, డిసెంబర్ 1 : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు అస్లాం పాష గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఆయన వివిధ పత్రికల్లో పనిచేశారు. అస్లాం పాష మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మార్పీఎస్ పెద్దముప్పారం గ్రామ కమిటీ ఎన్నిక

ధర్మారపు కిరణ్, అధ్యక్షుడు

దంతాలపల్లి, డిసెంబర్ 1 : ఎంఆర్‌పీఎస్ పెద్దముప్పారం గ్రామ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మారపు కిరణ్, ఉపాధ్యక్షుడిగా ధర్మారపు ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా ధర్మారపు వినోద్, అధికార ప్రతినిధిగా మూరగుండ్ల వెంకన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోమరాపు లింగన్న, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి మధు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

శాస్త్రీయ దృక్పథంతో విద్య అభ్యసించాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో విద్యను అభ్యసించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. పట్టణంలోని అనంతారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారం ముగిసింది. మధ్యాహ్నం ఎగ్జిబిట్ల స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులు ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనతో పొందిన జ్ఞానం నిత్య జీవితంలో ఉపయోగించుకోవాలన్నారు. ముగింపు సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ సుస్థిరమైన అభివృద్ధి శాస్త్ర విజ్ఞానం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ పరిరక్షణపై ఎక్కువ ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. టీచర్లు సైతం ప్రోత్సహించాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలో వివిధ పాఠశాల నుంచి వచ్చిన ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి అప్పారావు తెలిపారు. నైపుణ్యం కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్సీ, అదనపు కలెక్టర్, డీఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంకా బద్రినారాయణ,

స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ, అదనపు కలెక్టర్

లచ్చిరాం నాయక్, శ్రీ రాములు, శంకర్, రాందాసు, గురునాథ రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయుడు డాక్టర్ గురునాథరావు తయారు చేసిన రోబోటిక్ టెక్నాలజీ నేలను శుభ్రం పరిచే యంత్రం ఆకట్టుకుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , రోబోటిక్స్ టెక్నాలజీ పైన అవగాహన కలిగిస్తూ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఆవశ్యకతను గురునాథరావు వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

కురవి/మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. కురవిలోని ఆశ్రమ హైస్కూల్ బాలికలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆదివారం సాయంత్రం ఆకస్మికగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక రోడ్డులో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని కూడా కలెక్టర్ రాత్రి సందర్శించారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలను అమర్చాలన్నారు. అనంతరం విద్యార్థుల స్టడీ రూమ్‌లు, వంటశాల, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద టార్పాలిన్లను సిద్దంగా ఉంచాలన్నారు. కాంటా అయిన వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

దేవస్థానం గుట్టపై అక్రమ మట్టి దందా

గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న యంత్రాలు

నర్సింహులపేట, డిసెంబర్ 1 : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి గుట్టపై మట్టి తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. రైతులు తమ భూమిలోని మట్టిని వ్యవసాయ అవసరాలకు తరలిస్తేనే అడ్డుకుంటున్న అధికారులు గుట్టపై జరుగుతున్న మట్టి తవ్వకాలపై తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ గ్రామంలో రైతు వర్షం కారణంగా గుంతలు పడిన పొలానికి తన సొంత వ్యవసాయ బావి గడ్డ మట్టిని తరలిస్తుంటే అడ్డుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులను అడ్డుకునే అధికారులు మట్టిని అమ్ముకునేవారితో మాత్రం చేతులు కలిపినట్లు తెలుస్తోంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు ఇష్టం వచ్చినంత మట్టి తోలుకోవచ్చని దందాదారుల నుంచి అందినకాడికి వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, దేవస్థాన భూముల్లో అక్రమ మట్టి దందాను అరికట్టలని మండల ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు అండగా 'వాకర్స్'

చిన్నారులకు నగదు అందజేస్తున్న వాకర్స్

కురవి, డిసెంబర్ 1 : తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ ఇంట్లో ఉంటున్న అనాథ చిన్నారులు నాగమణి, సుమలతకు బలపాల గ్రామానికి చెందిక వాకర్స్ అండగా నిలిచి, రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. చిన్నతనంలోనే తండ్రి, వారంరోజుల క్రితం తల్లిని కోల్పోయి అమ్మమ్మ గురవమ్మ వద్ద ఉంటున్న చిన్నారుల పరిస్థితిని తెలుసుకుని ఆదివారం వాకర్స్ సభ్యులు అందరూ కలిసి నగదును అందజేశారు. వీన్ని గ్రామంలో బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. చిన్నారులకు భవిష్యత్తులోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్

గూడూరు, డిసెంబర్ 1 : మండలంలోని గూడూరు, చంద్రుగూడెం, గొల్లగూడెం, మర్రిమిట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని 50 మంది నిరుపేదలు, వృద్ధులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఆరె వీరన్న ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన తమ అసోసియేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీర భిక్షపతి, చెల్పూరి వెంకన్న, జూలూరి శ్రీనివాస్, సమ్మయ్య, దొడ్డ శ్రీనివాస్, మంగీలాల్, రవి, వీరన్న, క్రాంతి, యుగేందర్, నారాయణ, జుంకీలాల్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

నర్సింహులపేట, డిసెంబర్ 1 : ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నదని సీపీఎం జిల్లా నాయకుడు గునుగంటి మోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న ధాన్యంతో పాటు దొడ్డు రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ అందించాలన్నారు. వర్షాలు పడుతుండడంతో రైతులు తీసుకవచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సర్వన్, యాకుబ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

గూడూరు, డిసెంబర్1 : మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్వేత ఏవో అబ్దుల్ మాలిక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రా ల్లో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. నిబంధనల ప్రకారం తేమలేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, వర్షం వస్తే కార్పెట్లతో కప్పుకోవాలని సూచించారు.

'సంక్షేమ పథకాల్లో కార్మికులకు వాటా ఇవ్వాలి'

కురవి/చిన్నగూడూరు, డిసెంబర్ 1 : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కార్మికులకు ప్రత్యేక వాటా కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య అన్నారు. మండలంలోని తట్టుపల్లిలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నల్లశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. దీకొండ రవీందదర్, నారాయణ, మురళి, వెంకన్న, కే వెంకన్న, దేవేందర్, రాజు, సైదులు, మంగ్య పాల్గొన్నారు. చిన్నగూడూరు మండలం బుర్హాన్‌పురంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా పోసాని శ్రీనివాస్, కార్యదర్శిగా గణేశ్, ఉపాధ్యక్షుడిగా ఉప్పలయ్య, సహాయ కార్యదర్శిగా నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా అమీన్‌సాబ్ ఎన్నికయ్యారు.

గురుకులాలను గాలికి వదిలిన ప్రభుత్వం

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

కేసముద్రం : పండ్లను పరిశీలిస్తున్న హుస్సేన్ నాయక్

కేసముద్రం/నెల్లికుదురు, డిసెంబర్ 1 : పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ అన్నారు. కేముద్రం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. వంట గది, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అవుతున్నదని ఆరోపించారు. తరగతి గదుల్లో కూర్చోవడానికి టేబుల్స్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. బెడ్లు అందించకపోవడం వల్ల విద్యార్థినులు కింద పడుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి, ప్రిన్సిపాల్ సుజాత, నాయకులు నాగేశ్వరాచారి, గడ్డం అశోక్, రేవంత్ రెడ్డి, మోదిన్‌నాయక్, మదన్‌లాల్, ధర్మారెడ్డి, సందీప్ పాల్గొన్నారు. అలాగే, నెల్లికుదురు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కూడా ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. వంట తయారు చేసేవారితో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు, ఎంపీవో పద్మ, ప్రత్యేకాధికారి సుమలత పాల్గొన్నారు.

అధ్వానంగా మానుకోట గిరిజన ఆశ్రమ పాఠశాల

హాస్టల్ ఎదుట మాట్లాడుతున్న వాసు నాయక్

విద్యార్థులకు పెడుతున్న నీళ్ల చారు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు అధ్వానంగా మారాయని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల హాస్టల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలను అధికారులు పూర్తిగా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా నీళ్ల చారుతో అన్నం పెడుతున్నారన్నారు. హాస్టల్లో ఉంటున్న బాలికలతో పాచి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో హాస్టల్‌కు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినా వార్డెన్, అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు చెబుతున్నారన్నారు. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉండడం లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. వెంటనే కలెక్టర్ స్పందించి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలపై రేవంత్‌రెడ్డిది కపట ప్రేమ'

మరిపెడ, డిసెంబర్ 1 : ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ సర్కారు నాలుగు నెలలుగా మౌనం వహిస్తుందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలపై కపట ప్రేమ చూపుతున్నదని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. ఆదివారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంద కుమార్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ ఉద్యమం కొనసాగిస్తామన్నారు. లక్షలాదిమందితో ధర్మయుద్ధ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మార్పీ ఎస్ మండల కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా పరశురాములు, కోకన్వీనర్‌గా స్వామి, సభ్యులుగా కృష్ణ, సైదులు, వెంకన్న, రవి, సురేశ్, వీరబాబు, అశోక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు రవి మాదిగ, వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు.

'టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

కురవి, డిసెంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే చిత్తశుద్ధితో నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం ఐదో జిల్లా మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్ని విడుదల చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా తాను చేసిన పనులను పుస్తక రూపంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు మల్లారెడ్డి, సోమశేఖర్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ అవారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాకుబ్, కార్యదర్శులు నామ వెంకటేశ్వర్లు, జనార్దనాచారి, మంజుల, హరినాయక్, మంగయ్య, వివేక్, రమేశ్, స్వప్న పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న భాస్కర్

సింహగర్జనకు తరలిన మాలలు

తొర్రూరు/నెల్లికుదురు,డిసెంబర్1 : హైదరాబాద్‌లో జరిగిన మాలల సింహగర్జన బహిరంగ సభకు మాలమహానాడు శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా తొర్రూరు అంబేద్కర్ నగర్‌తోపాటు నెల్లికుదురులో జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి జెండా ఊపి ర్యాలీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేశ్, రాష్ట్ర నాయకులు గుండాల భిక్షం, మాల జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షుడు చంద శ్రీనివాస్, నాయకులు ఎనమాల రాకేశ్, టౌన్ అధ్యక్షుడు గార అనిల్ పాల్గొన్నారు.

'కాలనీలో సీసీ రోడ్లు వేయాలి'

మరిపెడ, డిసెంబర్ 1 : మున్సిపల్ కేంద్రంలోని మైనార్టీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కాలనీని సందర్శించి మాట్లాడారు. పలు వీధుల్లో కంకర, చిప్స్ పోసి వదిలేశారని, దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే సీసీ రోడ్లు నిర్మించాలనికోరారు. కార్యక్రమంలో సోమన్న, ఎల్లక్క, వెంకటేశ్వర్లు, యాకూబ్, మారయ్య, అక్రమ్, నాగుల్‌మీరా, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

మహబూబాబాద్ రూరల్/డోర్నకల్/నెల్లికుదురు/ నర్సింహులపేట/ దంతాలపల్లి/ తొర్రూరు, డిసెంబర్ 1 : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆదివారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. మహబూబాబాద్ అనంతారం ఆదర్శ పాఠశాలలో రెన్యూవబుల్ ఎనర్జీ రీసోర్స్ అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, డీఈవో రవీందర్ రెడ్డి సందర్శించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే, డోర్నకల్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన పోటీలో సెయింట్ అగ్నెశ్ హైస్కూల్ విద్యార్థి సాయిభార్గవ్ ప్రథమ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. కాంప్లెక్స్ హెచ్ఎం రుక్మాంధరావు సర్టిఫికెట్ అందజేశారు. ఉపాధ్యాయులు అప్పిరెడ్డి మాధవరావు, విజయ్ కుమార్, ఉదయ్ రాజ్, నాగరాజు పాల్గొన్నారు. నెల్లికుదురులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ జీవన్ కుమార్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా జీ అక్షయ(జడ్పీహెచ్ఎస్ నెల్లికుదురు), జీ శ్రీవల్లి(మోడల్ స్కూల్ నెల్లికుదురు), పీ ప్రకృతి(మోడల్ స్కూల్ నెల్లికుదురు)నిలిచినట్లు ఎంఈవో ఏ రాందాస్ తెలిపారు. ఉపాధ్యాయులు జనార్దన్, జీవన్ పాల్గొన్నారు. నర్సింహులపేట జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన పోటీలో కేజీబీవీకి చెందిన కే ధనలక్ష్మి, జీ కల్యాణి, రుచిత జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో రామ్మోహన్‌రావు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వీరెందర్,వెంకన్న, వెంకట్రాములు, సునిత, రవి పాల్గొన్నారు. దంతాపల్లి జడ్పీఎస్ఎస్‌లో కాంప్లెక్స్ హెచ్ఎం వేణుమధవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఎం బుచ్చయ్య, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బ్రహ్మానందరెడ్డి యాకూబ్‌అలీ, స్వామి పాల్గొన్నారు.

మహిళలకు వంటల పోటీలు

విజేతలకు బహుమతులు ఇస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : పట్టణంలోని ఆర్తిగార్డెన్‌లో హెచ్‌పీ గ్యాస్ నేతృత్వంలో మహిళలకు ఆదివారం వంటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ వంట చేసే సమయంలో మహిళలు గ్యాస్ వాడకంలో తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ సురేశ్ బాబు, మేనేజర్ బోనగిరి ప్రసాద్, సేల్స్ ఆఫీసర్లు నరేశ్, పవన్ పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వంటల పోటీల్లో డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో మధాహ్న భోజనం తయారీలో శుభ్రత పాటించాలన్నారు. మంచిగా వండిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందుల శ్రీరాములు, ఆజాద్, శ్రీలత పాల్గొన్నారు.

క్రీడాకారులతో జిల్లా అధికారులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మహిళా క్రీడ పోటీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కబడ్డీలో జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి సోమవారం నుంచి 6 వరకు కురవిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. వీరు 7,8,9 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్ది వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సందా వీరన్న, చాంప్లా నాయక్, ఏకాంబ్రం, శ్రీనివాస్, అఖిల్, అనిల్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

టీషర్టులు అందజేస్తున్న మహేశ్

ఇనుగుర్తి, డిసెంబర్ 1 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మండలంలోని చిన్నముప్పారం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు నామాల మహేశ్ అన్నారు. గ్రామంలోని యాదవకాలనీలో కబడ్డీ క్రీడాకారులకు ఆయన ఆదివారం రూ.15వేల టీషర్టులను పంపిణీ చేశారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిన్నాల కట్టమల్లు, సుధాకర్, కదిరే జగన్‌గౌడ్, బొల్ల అనిల్, నరసింహ, యాకయ్య పాల్గొన్నారు.

ప్రవీణ్ నాయక్‌కు నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

మరిపెడ, డిసెంబర్ 1 : తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు భూక్యా ప్రవీణ్‌నాయక్‌కు వర్ధంతి సందర్భంగా లంబాడీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ కేంద్రంలో ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర బాధ్యులు గుగులోత్ ప్రవీణ్, రమేశ్‌నాయక్ మాట్లాడుతూ నర్సింహులపేట మండలం పెద్దనాగారం శివారు గోపతండాకు చెందిన ప్రవీణ్‌నాయక్ తెలంగాణ సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్నాడన్నారు. ఆయన ఆశయాలు సాధించే వరకూ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ నాయక్, భానునాయక్, రాజేశ్, వెంకటేశ్, రాందాస్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకులకు నివాళి

కురవి/గార్ల, డిసెంబర్ 1 : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్, సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోటు ప్రసాద్ ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటాలకు కురవిలోని పార్టీ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వారి మరణం పార్టీ తీరని లోటన్నారు. మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న, తురక రమేష్, కన్నె వెంకన్న, దూది కట్ల సారయ్య పాల్గొన్నారు. కాగా, గార్లలో పార్టీ సీనియర్ నాయకుడు పల్లా కోటి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ పరామర్శించారు. జంపాల వెంకన్న, మాగం లోకేశ్, రవీందర్ పాల్గొన్నారు.

తొర్రూరు మోటారు ఓనర్లు, డ్రైవర్ల యూనియన్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

తొర్రూరు, డిసెంబర్ 1 : తొర్రూరు మోటార్ ఓనర్లు, డ్రైవర్ల యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిలుకర దామోదర్ , గౌరవ అధ్యక్షుడిగా మునుకుంట్ల యాకయ్య, ఉపాధ్యక్షులుగా పొన్నం సంపత్, కోట్ల యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా బోయిన మల్లేశ్, కార్యదర్శిగా మేకల వెంకన్న, కోశాధికారిగా పెదగాని సమ్మయ్య, కార్యవర్గ సభ్యులుగా జలగం అశోక్ , ఏపూరి నాగరాజు, వడ్లకొండ కుమార్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ బాధ్యులను మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ మాజీ అధ్యక్షుడు వడ్లకొండ కుమార్, భూసాని శ్రీశైలం పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం

నర్సింహులపేట, డిసెంబర్ 1 : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ప్రాగణంలో సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరూ పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు చదువు నేర్పించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు మల్లారెడ్డి, సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, రవిశంకర్, విష్ణువర్ధన్‌రావు, శ్రీనివాస్, అన్వర్, బిక్షం, శ్రీనివాస్‌తో పాటు పూర్వ విద్యార్థులు నరేశ్, నర్సయ్య, రమేశ్, శేషుకుమార్, స్వాతి, స్రవంతి, యామిని, రవి, రామాచారి పాల్గొన్నారు.